ప్రజాశక్తి
మంగళవారం 6 మే 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

పెరిగిన పశుగ్రాసం కొరత

వేసవి తీవ్రతతో అల్లాడుతున్న మూగజీవాలు - ఎండుగడ్డి, పచ్చగడ్డి దొరక్క పోషణకు పాడిరైతు అవస్థ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి



గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పశుగ్రాసం కొరత వెంటాడుతోంది. వేసవి తీవ్రత పెరగడంతో పశు పోషకులకు కష్టాలు పెరిగాయి. గత ఆరు నెలలుగా వర్షాలు లేక పచ్చిగడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. పశు గ్రాసం సరిగా అందక, వేసవి తీవ్రత వల్ల మూగ జీవాలు ఇబ్బంది పడుతు న్నాయి. పొలాల్లో పచ్చగడ్డి కరవైంది. ఎండు గండికి గిరాకి పెరిగింది. గ్రాసం లేక మూగజీవాలు బక్క చిక్కిపోతున్నాయి. దీంతో కొంత మంది పోషణ చేయలేక పశు వులను అమ్ముకుంటున్నారు. వరి కోతలు యంత్రాల ద్వారా చేయడం వల్ల గడ్డి నాణ్యత కూడా దెబ్బతింటోంది. సాధారణ ప్రక్రియలో కోతలు, నూర్పిడి జరిగితే ఎండుగడ్డి గ్రాసానికి బాగా ఉపయోగపడుతుంది. చాలా ప్రాంతాల్లో యంత్రాలు వినియోగం వల్ల గడ్డి కూడా దొరకని పరిస్థితి పలు గ్రామాల్లో నెలకొంది.

గుంటూరు జిల్లాలో 16,899 ఆవులు, 1,98,009 గేదెలు, 125451 గొర్రెలు, 20451 మేకలు ఉన్నాయని అధికార వర్గాలు తెలిపాయి. పల్నాడు జిల్లాలో అవులు 60,072, గేదెలు 4,67,046 గొర్రెలు 4,69,424, మేకలు 1,56,291 ఉన్నాయి. వీటికి ఎండుగడ్డి, పచ్చి గడ్డి కోసం రైతులు దూర భారాలు వెళ్లి తీసుకువస్తున్నారు. సొంత భూములుండి, వారే వ్యవసాయం చేసే వారికి గ్రాసం విషయంలో కొంత వెసులుబాటు ఉంది. ప్రత్యేకంగా ఆవులు, గేదెలు పోషకులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో పాల విక్రయాల ద్వారానే కుటుంబాల పోషణ కూడా జరిగేది. కానీ మారిన పరిస్థితుల్లో నిర్వహణా భారం పెరిగి కుటుంబ పోషణకు పూర్తి స్థాయిలో ఆదాయం రావడం లేదని చెబుతున్నారు. యాంత్రీకణ వల్ల వ్యవసాయంలో పశు పోషణ ప్రభావం కూడా తగ్గింది. పశువుల ద్వారా వచ్చే వ్యర్థాలను ఎరువుగా వినియోగించే పరిస్థితి ఉండేది. సహజ గుణం కలిగిన ఎరువుల వినియోగంపై ఎక్కువ మంది దృష్టి సారించడం లేదు. పశు వుల పోషణకు ఇటీవల కాలంలో మినీ డెయిరీలు ఏర్పాటు అయ్యాయి. గోకులాల ఆధ్వర్యంలో పశుపోషణకు గత ప్రభుత్వం తగిన ప్రోత్సహం ఇవ్వలేదు. గోపాల మిత్రలను నిర్వీర్యం చేయడం వల్ల పశు పోషణ భారంగా మారింది.

గతేడాది ఆగస్టు 31న కురిసిన అధిక వర్షాలతో జిల్లాలో ▶ 2లో



నరసరావుపేటలో కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

పీడిత వర్గాలకు మార్క్సిజమే మార్గదర్శి

కార్ల్‌మార్క్స్ జయంతి సందర్భంగా ఘన నివాళులు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

సమాజంలో దోపిడీ పీడన ఉన్నంత వరకూ ప్రపంచ పీడితవర్గాల మార్గదర్శి మార్క్సిజమేనని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. మార్క్సిస్టు సిద్ధాంతకర్త కారల్ మార్క్స్ 207వ జయంతి సందర్భంగా సోమవారం గుంటూరు బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో కార్ల్‌మార్క్స్ చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతాజి, విజయ్‌కుమార్ మాట్లాడుతూ మార్క్స్ కంటే ముందు చాలామంది తత్వవేత్తలు సమాజం మారుతుందని చెప్పారని, కానీ ఏ విధంగా మారుతుందో గతితార్కిక పద్ధతిలో చెప్పిన తత్వవేత్త కారల్ మార్క్స్ మాత్రమేనని అన్నారు. పెట్టుబడిదారీవర్గం వద్ద సంపద ఏ విధంగా పోగుపడుతుందో అదనపు విలువ సిద్ధాంతం ద్వారా మార్క్స్ చెప్పానని, ప్రపంచంలో సంక్షోభాలు ఎలా వస్తాయో శాస్త్రీయంగా నిరూపించారని తెలిపారు. ఆయా సంక్షోభాల నుండి బయట పడటానికి పెట్టుబడిదారీ వర్గం నేడు కారల్‌మార్క్స్ రచించిన 'పెట్టుబడి' గ్రంథాన్ని విరివిరిగా అధ్యయం చేస్తున్నారన్నారు. మార్క్సిజాన్ని తమ దేశానికి అన్వయించి లెనిన్ రష్యాలో సోషలిజాన్ని తీసుకొచ్చారని, ▶ 2లో



గుంటూరులో కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వై.నేతాజి తదితరులు



కుంచనపల్లిలో దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

వానతో పంట దెబ్బతిన్న రైతుల్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులందర్నీ ఆదుకోవాలని రైతుసంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంక రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివా రం ఉదయం గాలి, వానకు కుంచనపల్లిలో దెబ్బతిన్న పంటలను నాయకులు సోమవారం పరిశీలించి బాధిత రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివశంక రరావు మాట్లాడుతూ గత నెలలో అకాల వర్షం కురిసి పసుపు, మొక్కజొన్న పంటలు కళ్లాలలోనే తడిసిపోయాయని, ఇప్పుడు అరటి గెలలతో చెట్లు నేలకొరిగి రైతులకు నష్టం వాటిలిందని



చెప్పారు. మొక్కజొన్న పంట కూడా బూజు పట్టి దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రైతులకు వాటిల్లిన నష్టంపై తక్షణమే వివరాలు సేకరించి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పరిశీలనలో రైతుసంఘం నాయకులు ఎ.రంగారావు, ఎ.శివనాగేశ్వరరావు, కె.హరీష్ పాల్గొన్నారు.

12 నుండి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఈనెల 12వ తేదీ నుండి 20వ తేది వరకు జరిగే ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఆదేశించారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశం కలెక్టర్ నాగలక్ష్మీ సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ, ఇంటర్ ఆర్ఐఒ జుబేర్ , డిఇఓ రేణుకతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్ జరకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఇంటర్మీడియట్ మొదటి ఏడాది సప్లమెంటరీ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ కోర్సులకు 23,279 మంది విద్యార్థులు , రెండవ సంవత్సరం జనరల్, ఒకేషనల్ కోర్సులకు 3,883 మంది విద్యార్థులు హాజరవుతున్నందున ఆ మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఎఎన్ఎంలను అందుబాటులో ఉంచాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చూడాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డిఆర్ఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, ఆర్‌డిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పాలపర్రులోని మృతవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న పాశం రామారావు తదితరులు

పాలపర్రు మృతవీరులకు ఘన నివాళి

అమరుల స్ఫూర్తితో 20న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని నాయకుల పిలుపు

5 లో

మామను చంపిన అల్లుడికి జీవిత ఖైదు

2 లో



సోషల్ మీడియా పోస్టింగ్స్‌లపై అంబటి రాంబాబు ఫిర్యాదు


ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తాము ఇచ్చిన ఫిర్యాదులపై పోలీసులు స్పందించడం లేదని అందుకే న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి వస్తోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సోషల్ మీడియాలో పార్టీ మీద, పార్టీ నేతల మీద తప్పుడు వ్యాఖ్యలు, ప్రేలాపనలు చేసే వాళ్లను వదలబోమని, చట్టం ముందు దోషులుగా నిలబెట్టి తీరతామన్నారు. సోమవారం పట్టాభిపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన అనంతం ఆయన మీడియాతో మాట్లాడారు. టిడిపి సోషల్ మీడియా వింగ్ ప్రతినిధులు చేస్తున్న అసభ్యకర, అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో చంద్రబాబు, లోకేష్ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని, మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేస్తే సహించమని చెబుతూనే టిడిపి వారిపై చర్యలుతీసుకోవడం లేదన్నారు. గతంలోనూ మేం ఫిర్యాదులు చేశామని పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో తాము హైకోర్టును ఆశ్రయించగా ఐదు ఫిర్యాదుల్లో నాలుగు నమోదు చేశారన్నారు. గత కొన్ని రోజులుగా కిరాక్ ఆర్‌పి, సీమ రాజాల పేరుతో తమకు వ్యతిరేకంగా పోస్టింగ్స్ పెడుతున్నారన్నారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. విజయవాడ పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్ర బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిమ్మకాయల రాజు నారాయణ ,మెట్టు వెంకటప్ప రెడ్డి పాల్గొన్నారు.

ప్రాంతీయ గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో చదువుకొని వివిధ ఉద్యోగాలలో స్థిరపడిన వారు ఓల్డ్ లైబ్రరీ మిత్రుల అసోసియేషన్‌గా ఏర్పడి రూ.22వేల విలువైన డిఎస్సీ, ఆర్ఆర్‌బి, ఇతర పోటీ పరీక్షల పుస్తకాలను లైబ్రరీకి సోమవారం బహుకరించారు. లైబ్రరీ మిత్రుల అసోసియేషన్ చైర్మన్ జి.మురళి, అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ శ్రీనివాస్, టీచర్ నరసింహారావు ఈ పుస్తకాలను బహుకరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పూర్వ గ్రంథాలయాధికారి ఎ.అచ్చమాంబ, డాక్టర్ రాయపాటి మమత, డాక్టర్ రాధికారాణి, సిహెచ్.ఎస్.దీక్షితులు, జిల్లా గ్రంథాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, సహాయ గ్రంథాలయాధికారి కె.సుధాకరరావు పాల్గొన్నారు.



ఆదివారం ముగిసిన నాటకోత్సవాల్లో సురభి ప్రభావతికి గోపరాజు బాలా త్రిపుర సుందరమ్మ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

నాటిక పోటీల్లో విజేతల ప్రకటన

ప్రజాశక్తి - తెనాలి

కొలంకపురి నాటక కళా పరిషత్, శ్రీ సాయి ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 5 వరకు రూరల్ గ్రామం కొలకలూరు లో నిర్వహించిన ఆహ్వాన నాటిక పోటీల విజేతల వివరాలను న్యాయ నిర్ణేతలు ఆంజనేయ నాయుడు, చలసాని కష్ణ ప్రసాద్, ఎం సత్యనారాయణ ఆదివారం రాత్రి వెల్లడించారు. మొదటి ఉత్తమ ప్రదర్శనగా విజయవాడ యంగ్ ఆర్ట్స్ థియేటర్స్ వారి 27వ మైలురాయి, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా విశాఖపట్నం చైతన్య కళా స్రవంతి వారి అసత్యం, తతీయ ఉత్తమ ప్రదర్శనగా హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారి స్వేచ్ఛ నాటిక నిలిచింది. ఉత్తమ నటుడుగా స్వేచ్ఛ నాటకలో ఆనందమూర్తి పాత్రలో నటించిన గోవాడ వెంకట్, ఉత్తమ నటిగా 27వ మైలు రాయి నాటికలో వైదేహి పాత్రలో నటించిన సురభి ప్రభావతి నిలిచారు. విజేతలకు నిర్వాహక బృందం బహుమతులు అందజేసింది. కార్యక్రమాన్ని గోపరాజు రమణ, విజయ్ తదితరులు పర్యవేక్షించారు.

డాక్టర్ రాధాకృష్ణ మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటు

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ వైద్యులు డాక్టర్ రాధాకృష్ణ(77)సోమవారం అనారోగ్యంతో గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లో ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన నివాసంలో రాధాకృష్ణ భౌతిక ఖాయాన్ని సిపియం నాయకులు సందర్శించి, భౌతిక ఖాయంపై పార్టీ జెండాను కప్పి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వై.నేతాజి మాట్లాడుతూ డాక్టర్ రాధాకృష్ణ మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటని అన్నారు. రాధాకృష్ణ 42 సంవత్సరాల క్రితం నరస రావుపేటలో డాక్టర్‌గా ప్రాక్టీస్ చేసి, పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారన్నారు. ఏడు సంవత్సరాలు ప్రజా వైద్యశాల నడిపి తర్వాత ప్రభుత్వ సర్వీస్‌లోకి వెళ్లారన్నారు. ఆ కాలంలో నరసరావుపేటలో వామపక్ష ఉద్యమా లకు, విద్యార్థి ఉద్యమాలకు ఆయన ఎంతో సహకారం అందించారని తెలిపారు. వినుకొండ ప్రాంతంలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన కాలంలోనూ ఉద్యమాలకు ఆయన ఎంతో సహాయపడ్డారన్నారు. ఆయన సతీమణి పద్మావతి ప్రజాతంత్ర మహిళా సంఘంలో జిల్లా నాయకురాలుగా కూడా పని చేశారన్నారు. వారు ఇప్పటివరకు వామపక్ష ఉద్య మానికి నిరంతరం సహాయ పడుతూనే ఉన్నారన్నారు. డాక్టర్ రాధాకృష్ణ అంత్యక్రియలు నేడు ఉదయం9.30 గంటలకు గుంటూరులోని బృందావన గార్డెన్స్ 5వ లైన్ నుండి బయలుదేరి స్థంభాల గురువు మహాప్రస్తానంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో పార్టీ నగర కార్యదర్శి కె.నళినీకాంత్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కంచుమాటి అజయ్, వై. కృష్ణకాంత్, కాకుమాను నాగేశ్వరావు తదితరులు ఉన్నారు.



రాధాకృష్ణ భౌతిక ఖాయానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

పీడిత వర్గాలకు మార్క్సిజమే మార్గదర్శి

(మొదటి పేజీ తరువాయి)

మార్క్స్ చెప్పింది ఆచరణలో సాధ్యమవుతుందని ప్రపంచానికి లెనిన్ నిరూపించాడని అన్నారు. సమాజంలో ప్రజలు దోపిడికి గురైనంత కాలం మార్క్సిజం అజేయంగా వుంటుందన్నారు. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళ తప్ప.. జయించడానికి ప్రపంచం ఉంది.. అంటూ శ్రామిక వర్గానికి ఒక సిద్ధాంతాన్ని మార్క్స్ అందించారని కొనియాడారు. నేడు దేశంలో మితవాద శక్తులు నయా ఫాశిస్టు శక్తులు పాలిస్తున్న నేపత్యంలో మార్క్సిజం ప్రాధాన్యత మరింతగా పెరిగిందన్నారు. మార్క్సిజం సారాంశాన్ని ప్రజల్లోకి విరివిరిగా తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, కె.నళీనికాంత్, నాయకులు బి.ముత్యాలరావు, వై.కృష్ణకాంత్, ఎ.వి.వర్మ, వి.నారాయణ, సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, ఎస్.ఆంజనేయులు నాయక్, జి.రవిబాబు, నాయకులు కె.రామారావు, డి.శివకుమారి, సిలార్ మసూద్, హనుమంతరెడ్డి, మల్లీశ్వరి, ఎఐటియుసి నాయకుల కె.రాంబాబు, రంగయ్య, వివిధ సంఘాల నాయకులు రెడ్ బాష, కె.కృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని పాలపర్రులోని సిపిఎం కార్యాలయంలో కార్ల్‌మార్క్స్ జయంతి నిర్వహించారు. చిత్రపటానికి సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు పూలమాలలేసి మాట్లాడారు. మార్క్సిజం ఆచరణలో సాధ్యం కానీ పిడి సూత్రమని పెట్టుబడిదారులు ప్రచారం చేశారని అయితే రష్యాలో లెనిన్ 1917లో సోషలిస్టు విప్లవాన్ని జయప్రదం చేయగా, 1949లో చైనాలో కమ్యూనిస్టు పార్టీ అధికారం చేపట్టిందని, వియత్నాం, క్యూబా లాంటి దేశాలలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి, వీటికి మార్క్సిజమే ప్రాతిపదికని వివరించారు. ప్రపంచంలో 160 కోట్ల మంది కమ్యూనిస్టు పార్టీ పాలనలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, జె.రామారావు, జి.హరిబాబు, పీటర్, జె.శంకర్రావు, ఎ.సుబ్బారావు టి.ప్రతాపరెడ్డి, డి.శ్రీనివాసరావు, ఎ.ఆశీర్వాదం, జె.రఘురాం, షమీ, సరళ, భువనేశ్వరి ఎం.లక్ష్మి, పి.సలీం పాల్గొన్నారు.



మార్క్స్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక సిపిఐ కార్యాలయంలో కార్ల్ మార్క్స్ చిత్రపటానికి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పూలమాలలేసి నివాళులర్పించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి ఎ.ప్రభాకర్, నాయకులు వై.వెంకటేశ్వరరావు, ఎన్.బ్రహ్మేశ్వరరావు, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మామను చంపిన అల్లుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

విజయవాడ రామవరప్పాడుకు చెందిన కుర్ర శివ నాగభూషణం తన సొంత మామ వెలగపూడి సాంబశివరావును హతమర్చిన కేసులో శివనాగభూషణంకు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ గుంటూరు రెండవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వై.నాగరాజా సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మృతుడు సాంబశివరావుకు ఇద్దరు కుమార్తెలు. గుంటూరు కాకుమానివారితోటలోని సూర్య హనుమాన్ అపార్ట్మెంట్లో నివాసం ఉంటున్నాడు. ఆయన పెద్ద కుమార్తె వాణిని విజయవాడ రామవరపాడుకు చెందిన తన సొంత మేనల్లుడైన కుర్ర శివ నాగభూషణంతో 20 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. నాగభూషణం తాగుడు, ఇతర వ్యసనాలకు లోనై తన సొంత ఆస్తిని పోగొట్టుకొని భార్య వాణిని హింసించేవాడు. వీటిని భరించలేక వాణి తన పుట్టింటికి వచ్చి విడాకుల కోసం గుంటూరు ఫ్యామిలీ కోర్టులో అప్లయ్ చేశారు. విడాకులు వస్తే భార్య ఆస్తి తనకు రాదని కక్షపెంచుకున్న నాగభూషణం ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. 2017 జులై 30వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో గుంటూరులో తన మామ, భార్య వాణి ఉంటున్న సూర్య హనుమాన్ అపార్ట్మెంట్‌కు వచ్చి వాణిని అసభ్యకర పదజాలంతో తిడుతూ కత్తితో దాడి చేయగా ఆమె తన చేతులు అడ్డుపెట్టడంతో చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను కాపాడేందుకు తండ్రి సాంబశివరావు అడ్డు వెళ్లగా అయన్నూ నాగభూషణం కత్తితో పొడిచి పరారయ్యాడు. సాంబశివరావును తొలుత గుంటూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో, తర్వాత విజయవాడలోని ఆయుష్ హాస్పటల్‌కు తరలించారు. అయితే 10 రోజుల తర్వాత ఆయన మరణించాడు. దీనిపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి సిఐ ఎం.శ్రీకాంత్ బాబు విచారణ చేయగా కోర్టులో ఛార్జిషీట్‌ను సిఐ కె.వంశీధర్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో పైమేరకు న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

పెరిగిన పశుగ్రాసం కొరత

(మొదటి పేజీ తరువాయి)

815 పశువులు మృత్యువాతపడ్డాయి. గ్రామాల్లో పశువైద్య సిబ్బంది కొరత కూడా ఉంది. పల్నాడు జిల్లాలో పశుచికిత్స సహాయకుల పోస్టుల కొరత కూడా ఉంది. వెటర్నీరి అసిస్టెంట్ సర్జన్స్ పోస్టులు 9 ఖాళీగా ఉండగా కార్యాలయాల్లో సహాయకుల పోస్టులు 63 వరకు ఖాళీగా ఉన్నాయి. వెటర్నీరీ అసిస్టెంటు పోస్టులు 19 ఖాళీగా ఉన్నాయని తెలిసింది. పశు గ్రాసం కొరతను తీర్చేందుకు ప్రభుత్వం దాణాను సరఫరాకు చర్యలు చేపట్టాలని పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు సూచించారు. ఇందుకు స్పందించిన ప్రభుత్వం త్వరలో బియ్యం కార్డు ఉన్న వారికి 50 శాతం రాయితీతో దాణా సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఒక్కో కుటుంబానికి గరిష్ఠంగా 2 పెద్ద పశువులు, ఒక దూడకు 90 రోజులకుగాను 450 కిలోల దాణాను అందించనున్నారని అధికారులు తెలిపారు. రూ.1100 విలువైన 50 కిలోల బస్తాను రూ.555కి ఇవ్వనున్నారు. పశుగ్రాసం కొరతను అధిగమించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

మెడికల్ కౌన్సిల్ చైర్మన్‌గా డాక్టర్ దగ్గుమాటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తిరుపతికి చెందిన ప్రముఖ రేడియాలజిస్ట్, డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావును రాష్ట్రంలో వైద్యుల వృత్తిపర నియంత్రణ, పర్యవేక్షణ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌కు చైర్మన్ గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ చైర్మన్ గా డాక్టర్ గోగినేని సుజాతను నియమిం చింది. గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన కౌన్సిల్ సభ్యులు రాజీనామా చేయడంతో ప్రభుత్వం నూతన కార్యవర్గాన్ని నియమించింది. కౌన్సిల్ లో మొత్తం 23 మంది సభ్యులు ఉండాల్సి ఉండగా ఇప్పటికీ కేవలం ఆరుగురు నామినేటెడ్ సభ్యులని మాత్రమే ప్రభుత్వం నియమించింది. 13 మంది సభ్యులను వైద్యులు ఎన్నుకోవలసి ఉంది. మరో నలుగురు ఎక్స్ అఫీషియో మెంబర్స్ గా ఉంటారు.

కెరీర్ గైడెన్స్‌పై రేపు సదస్సు

ప్రజాశక్తి - గుంటూరు : పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల భవిష్యత్తు కోసం వియ్ ఆర్ విత్ యూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 7న ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ స్థానిక బ్రాడీపేట, 2/7లోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో గెరీర్ గైడెన్స్ సదస్సు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఈ సదస్సులో ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ అయ్యప్ప సిగినం పాల్గని అవగాహన కల్పిస్తారన్నారు. ఈ సదస్సు ద్వారా ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంకా ఎన్నో కోర్సులపై పూర్తి అవగాహన, పిల్లలకి సరిపడే కెరీర్ ప్లాట్‌ఫామ్ ఏదో తెలుసుకోవచ్చన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రక్తకన్నీరు నాగభూషణం పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నాటక రంగం నుండి ఆవిర్భవించిన మహానటుడు నాగభూషణం కళలకు, కళాకారులకు, సమాజానికి చేసిన సేవ నిస్వార్థమైనదని అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకుడు లంకా సూర్యనారాయణ పేర్కొన్నారు. నటుడు చుండి నాగభూషణం గురించి తొలిసారిగా ప్రచురించిన పుస్తకాన్ని సోమవారం నాగభూషణం వర్ధంతి సందర్భంగా సూర్యనారాయణ ఆవిష్కరించారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయంలో జరిగిన 'రక్తకన్నీరు నాగభూషణం' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో లంకా సూర్యనారాయణ మాట్లాడుతూ..పాశ్చాత్య వ్యామోహంలో చేసిన తప్పులపై నాగభూషణం రక్తకన్నీరు నాటకం, చిత్రం ద్వారా అద్భుతమైన నటనను అందించారని కొనియాడారు. కుష్టురోగం వచ్చి, కళ్ళు పోయిన పాత్రలో రక్తకన్నీరులో నాగభూషణం పలికిన సంభాషణ ఉచ్చారణ ప్రేక్షకుల గుండెల్ని పిండేస్తుందన్నారు. కేవలం నాటకాల ద్వారానే ఆయన సమాజ చైతన్యాన్ని తీసుకువచ్చారని ప్రశంసించారు. సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత సూపరింటెండెంట్ గుమ్మడి సీతారామయ్య చౌదరి మాట్లాడుతూ ముప్పై ఏళ్ల పాటు రంగస్థలం మీద నాగభూషణం రక్తకన్నీరు నాటకం వెలిగిందని, వేల ప్రదర్శనలు సాగాయన్నారు. రక్తకన్నీరు నాటకం పేరును ఇంటి పేరుగా మార్చుకున్న నాగభూషణం, సినిమాల్లో నటిస్తున్నా నాటక రంగాన్ని మర్చిపోలేదన్నారు. రక్తకన్నీరు ఒక కొత్త చరిత్ర లిఖించిందన్నారు.అందులో ఆయన నటన చిరస్మరణీయమన్నారు. తెలుగు నాటకరంగ పుటలలో రక్తకన్నీరుకు సుస్థిర స్థానం దక్కుతుందన్నారు. సాహితీ వేత్తలు మిక్కిలినేని శ్రీనివాస్, వేగి దుర్గారావు, ఉదయగిరి ఫయాజ్ పాల్గొన్నారు.



మంత్రి నారా లోకేష్‌ను కలిసిన డాక్టర్ కోడెల శివరామకృష్ణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలోని తన నివాసంలో సోమవారం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివ రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. లోకేష్‌కు పుష్ప గుచ్చం అందజేశారు. నరస రావుపేట నియో జకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితిపై ముచ్చటించారు.



లోకేష్‌తో కోడెల శివరామకృష్ణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న గంటా శ్రీనివాసరావు

విద్యార్థులతో కథల పఠనం

ప్రజాశక్తి-ఈపూరు : గ్రంథాలయాలలో వేసవి శిక్షణ తరగతులు విద్యార్థులకు నైపుణ్యం పెంచేందుకు దోహదం చేస్తాయని గ్రంథాలయ నిర్వాహకులు గంటా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఈపూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించి ప్రపంచ పటంలో ఉన్న దేశాలను వివరించారు.



కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న 'కన్నా'

మండలంలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-ముప్పాళ్ల

సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ సోమవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద గల బీసీ కార్పొరేషన్ ఈడబ్ల్యుఎస్ సహకారంతో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం తొండపి గ్రామంలో సిసి రోడ్లు సిసి డ్రైన్స్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి తెలుగు దేశం పార్టీతోనే సాధ్యమనీ అన్నారు. కార్యక్రమంలో మండలాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బాలికల భవితకు కిశోరి వికాసం

యుక్త వయస్సు బాలికల కొరకు వేసవి శిక్షణ కార్యక్రమం

పోస్టర్‌ను విడుదల చేసిన పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యుక్త వయస్సులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్‌కు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతో దోహద పడుతుందని కలెక్టర్ పి అరుణ్ బాబు అన్నారు. కౌమార బాలికల సాధికారిత లక్ష్యంగా జిల్లా మహిళాభి వృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కిశోరి వికాసంపై పోస్టర్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 2వ తేదీ నుంచి జూన్ 10 వరకు వివిధ శిక్షణా కార్య క్రమాలను యుక్తవయస్సు బాలికలకు అందిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలంటే వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో ఈ ప్రత్యేక సమ్మర్ క్యాంపెయిన్ గ్రామ, వార్డు స్థాయిలో కిశోరీ బాలికల సాధికారత కొరకు ఆరు అంశాలను చర్చిస్తూ ముందుకు సాగే విధంగా పుస్తకాలను రూపొందించారన్నారు. యుక్త వయస్సు బాలికలకు విద్య ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఉన్నత విద్య, కెరీర్‌మార్గదర్శనం అంశాలపై సమీక్షించారు.

కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు



మాట్లాడుతున్న అమలకుమారి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కలెక్టర్ కార్యాలయంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌లో రైతులు తమ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఉత్పత్తి చేసిన ఆరోగ్యకరమైన ధాన్యాలు, పండ్లు, కూరగాయలు ఉత్పత్తులను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమల కుమారి మాట్లాడుతూ రసాయనాలతో నిండిన ఆహారం స్వీకరించడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, ప్రతి వ్యవసాయ పద్ధతుల్లో ఉత్పత్తి చేసిన ఆహార పదార్థాలను ప్రజలు వినియోగించడం అవసరమన్నారు. కార్యక్రమంలో నాచురల్ ఫామింగ్ అసోసియేటింగ్ యం.మేరీ, నరస రావుపేటలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కమ్యూనిటీ హెల్త్ సిబ్బందిని తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ అండ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని గాంధీ పార్కు వద్ద ఎనిమిది రోజుల నుండి సమ్మె చేస్తూ తమ నిరసన తెలియజేస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారుల సమ్మె శిబిరాన్ని సోమవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ తరపున విలేజ్ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారులు తమ న్యాయమైన డిమాండ్లను, సమస్యలను పరిష్కరించాల్సిన కూటమి ప్రభుత్వం వినే పరిస్థితిలో లేదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కూడా స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. విలేజ్ హెల్త్ సెంటర్లలో పనిచేస్తూ అన్ని గ్రామాలకు వెళ్లి ఎనిమిదేళ్ల నుంచి ప్రజలకు సేవ చేస్తున్నా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదన్నారు. బీఎస్సీ, ఎంఎస్సి నర్సింగ్ కోర్సులు పూర్తి చేసి సెలక్షన్ ప్యానల్ కమిటీ ద్వారా రిక్రూట్ అయ్యారని తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. పల్నాడు జిల్లా జిల్లా రైతు సంఘం అధ్యక్షులు అన్నం పున్నారెడ్డి, మాజీ ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు షేక్ కరీముల్లా పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట నియోజకవర్గంలో నియంత పాలన

కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో ప్రజలకు మంచినీళ్లు ఇవ్వకుండా కూటమి నాయకులు అధికారులు నియంతలా పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలెం గ్రామం కేవలం సొంత గ్రామమని వివక్షతో మంచినీళ్లు ఇవ్వకుండా అధికార పార్టీ నాయకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. నాలుగు నెలలుగా గ్రామంలో మంచినీళ్లు ఇవ్వకుండా, శానిటేషన్ చేయకుండా, రాత్రివేళ వీధి దీపాలకు కరెంటు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. గ్రీన్ అంబాసిడర్లను తొలగించి వేరే గ్రామస్తుల ద్వారా పనులు చేయిస్తామని చెబు తతున్నారని, నాలుగు నెలల నుంచి అది కూడా చేయడం లేదన్నారు. గ్రామం లో మంచినీరు ఇవ్వటానికి ఎటువంటి ఇబ్బంది లేదని, ఆరెకరాలలో మంచినీటి చెరువు, ఓవర్ హెడ్‌ట్యాంక్, పైప్‌లైన్లు ఉన్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శిని సమస్యలపై సర్పంచ్, ఎంపీటీసీ అడిగితే తాను చేసేదేమీ లేదని చెప్పడం తగదన్నారు. సర్పంచ్ లకు, ఎంపీటీసీలకు పదవి కాలం ఉన్నప్పటికీ వైసిపికి ఏక పక్షమైన గ్రామం కావడంతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కలెక్టర్, డిపిఆర్‌ఓ లను కోరారు. తక్షణమే గ్రామానికి అధికారులను పంపి విచారణ జరిపి సమస్య పరిష్కారానికి కషి చేస్తానని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో బుచ్చిపాపన్నపాలెం ఎంపిటిసి, గ్రామ సర్పంచ్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న గోపిరెడ్డి



గడ్డివాముపై నీళ్లు చల్లుతున్న స్థానికులు

గడ్డివామిలో మంటలు

స్థానికుల అప్రమత్తతో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులోని మేదర వీధిలో సోమవారం ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగి కలకలం రేపాయి. మహాలక్ష్మమ్మ చెట్టు సమీపంలో కొండ సాంబయ్యకు చెందిన వరిగడ్డి వాములో ఉదయం 10.30 గంటల సమయంలో అకస్మాత్తుగా పొగలు రావడం గమనించిన స్థానికులు వెంటనే స్పందించారు. సమీపంలోని ఇంటి వద్ద పనులు చేస్తున్న వారు, గమనించి సత్వరమే స్పందించి మోటర్ సాయంతో నీళ్లు కొట్టారు. క్షణాల్లో జెసిబిను అక్కడికి తీసుకువచ్చి వామును పక్కకు నెట్టి మంటల వ్యాప్తిని పెరగకుండా చేశారు. వాముకు అతి దగ్గరలో ఉన్న గేదెలను సకాలంలో కట్లు విప్పి బయటకు పంపించేశారు. స్థానికుల సమయస్ఫూర్తి, ఆత్మస్థైర్యం వల్ల మంటలు మరింత వ్యాపించకముందే ఆర్పివేయడంతో పెనుప్రమాదాన్ని తప్పించారని ఊపిరి పీల్చుకున్నారు. ఈ మంటలు ఆకతాయిల కారణంగా రాచుకున్నవేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతిభా పురస్కారానికి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి పెదకూరపాడు

మండలంలోని 75 త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్.నాగూర్ బీ గ్రామీణ ప్రాంత పదవ తరగతి ఫలితాల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచనందుకు విద్యార్థి వికాస వాహిని(వి.వి.వి) సంస్థ ఇచ్చే ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ ప్రతిభ పురస్కారాన్ని విశ్వకవి రవీంద్రుని 165 వ జయంతి సందర్భంగా ఈ నెల 7వ తారీఖు బుధవారం విజయవాడలోని రామమోహన గ్రంథాలయంలో జరిగే కార్యక్రమంలో అందజేయనున్నారు. కార్యక్రమంలో శాసన సభ్యులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు,ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ జి.వి.పూర్ణచందు, విద్యార్థి వికాస వాహిని సంస్థకి చెందిన వేములపల్లి కేశవరావు,మర్రి శ్రావణి పాల్గొని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తారు. జి.రామ రత్నం చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఈ మెరిటోరియస్ అవార్డులను విద్యార్థి వికాస వాహిని సంస్థ వారు అందజేస్తు న్నారు. ఈ పురస్కారానికి ఎంపికైన నాగూర్బిని ప్రధానోపా ధ్యాయులు ఎ.శ్రీనివాస రెడ్డి,ఉపాధ్యాయులు,పీసి చైర్మన్ జి.పున్నారావు,



షేక్.నాగూర్ బీ

మద్యం దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు ప్రొహి బిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల, ఈపూరు మండలాలలో మద్యం దుకాణాలను సోమవారం ఆకస్మిక తనిఖి చేపట్టినట్లు సిఐ డి వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలో వీరాంజనేయ, జనతా మద్యం దుకాణాల వద్ద డెకాయ్ ఆపరేషన్ సిఐ డి వెంకటేశ్వర్లు నిర్వహించారు. రొంపిచర్ల మండలంలోని నీలకంఠేశ్వర, త్రికోటేశ్వర మద్యం దుకాణాలలో రికార్డులను ఎక్సైజ్ ఎస్సై కె.శ్రీనివాసరావు తనిఖీ చేశారు. మద్యం దుకాణ దారులు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలని, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించుట నేరమని నిబంధనలను వ్యతిరేకించిన వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు.



నాగార్జున సాగర్ కుడి కాల్వ మరమ్మతులు చేయాలని కలెక్టరేట్ ఎదుట నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నాగార్జున సాగర్ కుడి కాల్వ ఏర్పడి 50 ఏళ్లు దాటినా కాల్వలు పూడిక తీయకపోవడం వల్ల కాల్వ గట్లు తెగటం, ముళ్ల కంపతో కాల్వ నిండిపోవడం, రైతులు తిరగటానికి కాల్వ గట్లపై దారి లేకపవడం వంటి సమస్యలు నెలకొన్నాయని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. పిడిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, ఎన్.రామారావు మాట్లాడుతూ కాల్వ మరమ్మతులు చేపట్టకపోవడంతో చివరి భూములకు నీరు అందడం లేదన్నారు. మరమ్మతులకు తక్షణమే నిధులు కేటాయించాలని, వర్షాలు పడక ముందే పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అధికారులకు రైతులు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని, అందుబాటులోనూ ఉండడం లేదని విమర్శించారు. కాల్వలపై పర్యవేక్షణ కరువై ఆక్రమణకు గురవుతున్నాయని చెప్పారు. వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి, విఠంరాజుపల్లి, ఎన్ఎస్పి మైనర్ ఇరిగేషన్ కాల్వ కూడా మరమ్మతులకు గురైందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వగా, సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, వి.కోటనాయక్, షేక్ మస్తాన్‌వలి, ప్రసన్నకుమార్, మస్తాన్‌వలి, బి.శ్రీనివాసరావు, థామస్ రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ రామకోటయ్య సేవలకు గుర్తింపు

'రీజినల్ సర్వీస్ అవార్డు ఫర్ పల్స్ పోలియో ఫ్రీ'తో సత్కారం

ప్రజాశక్తి - మాచర్ల

వైద్య సదుపాయలకు దూరంగా వున్న ప్రజలకు ఎన్నోఏళ్లుగా డాక్టర్ కొండవీటి రామకోటయ్య అందించిన సేవలకు గుర్తింపు లభించింది. మాచర్ల రోటరి క్లబ్ సభ్యుడైన డాక్టర్ కొండవీటి రామకోటయ్య 25 ఏళ్లుగా నాటు పడవల ద్వారా కృష్ణానదిలో ప్రయాణించి, నల్లమల అటవీ మార్గం ద్వారా నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలోని వలస ప్రాంతాలకు చెందిన సుమారు 500 కుటుంబాల చిన్నారులకు, పోలియో చుక్కలు వేశారు. ఆయన అందించిన సేవలకు గాను రోటరీ ఇంటర్నేషనల్ ప్రత్యేక గుర్తింపును ఇస్తూ 'రీజినల్ సర్వీస్ అవార్డు ఫర్ పల్స్ పోలియో ఫ్రీ 24-25' అవార్డును ప్రదానం చేసింది. పట్టణంలోని డాక్టర్ వెలగపూడి లక్ష్మణ్ దత్తు ఔటర్ ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి నుండి అవార్డును డాక్టర్ కోటయ్య అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సత్కరించారు. రామకోటయ్యతోపాటు మరో 10 మంది బృంద సభ్యులనూ సన్మానించారు. కార్యక్రమంలో పాస్ట్ డిస్టిక్ గవర్నర్ కెపి.రంగారావు, కెసిపి-1 యూనిట్ హెడ్ వి.వి.రమణ, డిస్ట్రిక్ట్ అవార్డు కమిటీ చైర్మన్ డాక్టర్ విష్ణుబాబు, అసిస్టెంట్ గవర్నర్ సుమిత్ర కుమార్, ప్రెసిడెంట్ కష్ణకుమారి, సెక్రెటరీ నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మి, ప్రోగ్రాం కన్వీనర్లు ఇక్కుర్తి శంకర్, తిర్లిక శ్రీనివాసరావు, ప్రోగ్రాం ఆర్గనైజర్ పఠాన్ నాగూర్‌వలి, కెసిపి హెచ్.ఆర్.ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.



పొగాకు రైతులతో ఆడుకుంటున్న కంపెనీలు, ప్రభుత్వం

- కూలీలకు డబ్బులివ్వలేక, కుటుంబాలను గడుపుకోలేని దుస్థితిలో సాగుదార్లు
- పలు గ్రామాల్లో రైతులతో మాట్లాడిన కౌలురైతు సంఘం
- పంట అమ్ముకోలేక అవస్థలు పడుతున్నామని గోడువెళ్లబోసుకున్న రైతులు



ప్రజాశక్తి-చిలకలూరిపేట

పొగాకు కొనుగోలు చేయకుండా రైతుల జీవితాలతో కంపెనీలు, ప్రభుత్వం ఆడుకుంటున్నాయని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ అన్నారు. మండల పరిధిలోని మద్దిరాల, కమ్మవారిపాలెం, గోవిందపురం, కోమిటినేనివారిపాలెం, ఇర్లపాడు, గంగన్నపాలెం, కావూరు, లింగంగుంట్ల తదితర గ్రామాల్లో పొగాకు రైతులను సంఘం నాయకులు సోమవారం కలిసి మాట్లాడారు. పొగాకు కొనుగోళ్ల ఎక్కడా జరగడం లేదని, కొన్నిచోట్ల వ్యాపారు రూ.ఆరేడు వేలకు అడుగుతున్నారని రైతులు చెప్పారు. మండెలు వేసిన ఆకు కుళ్లిపోతుందనే భయాన్ని వ్యక్తం చేశారు. అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని, ఇంట్లో ఖర్చులు సైతం కొత్త అప్పులు చేస్తున్నట్లు వాపోయారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ పనులు చేసిన కూలీలకు డబ్బులిచ్చే పరిస్థితిలో కూడా రైతులు లేరని, బాండు ఉన్న రైతులు కంపెనీ కొనుగోలు కేంద్రం వద్దకు పంటను తీసుకెళ్లినా నాణ్యమైన ఆకునే రూ.10-13 వేలకు కొని మిగిలినదాన్ని వెనక్కు పంపుతున్నారని తెలిపారు. గతంలో రవాణా ఖర్చులుగా క్వింటాళ్‌కు రూ.200 ఇచ్చేవారని, ఇప్పుడు ఇవ్వడం లేదని తెలిపారు. గతేడాది గుల్లతో సహా రూ.15 వేలకు తగ్గకుండా కొన్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి రైతుల పంటనంతా కొనేలా చూడాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ పథకంలో కౌలురైతులకు రూ.20 వేలు ఇస్తానన్న ప్రభుత్వం ఇంకా ఇవ్వలేదని, కౌల్దార్లను కనీసం గుర్తించలేదని అన్నారు. ఇదిలా ఉండగా ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు ప్రతివారం డబ్బులివ్వడం లేదని, నిర్ణయించిన రూ.306 కూడా పడడం లేదని, సమ్మర్ అలవెన్సు ఇవ్వడం లేదని, ఎండలు తీవ్రంగా ఉన్న పని ప్రదేశాల్లో సరైన సదుపాయాలు లేవని చెప్పారు. వీటన్నింటి నేపథ్యంలో గ్రామాల్లో రైతులు, కౌలురైతులు, కూలీల పరిస్థితి తీవ్ర ఇబ్బందికరంగా మారిందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.వెంకటేశ్వర్లు, రైతులు కె.నాగరాజు, ఎన్.ఇస్మాయిల్, కె.చక్రవర్తి, వి.చెంచయ్య, పి.కేశవరావు పాల్గొన్నారు.


కోటేశ్వరరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న విజయ్‌కుమార్ తదితరులు


పిలకతపు కోటేశ్వరరావు (ఫైల్)

సిపిఎం నాయకులు పిలకతపు కోటేశ్వరరావు మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని ఫణిదం గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు పిలకతపు కోటేశ్వరరావు గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. కోటేశ్వరరావు భౌతికకాయాన్ని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, ఇతర నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ సిద్ధాంతం కోసం అంకితభావంతో, నిజాయితీగా నిలవటమే కాకుండా, క్లిష్టసమయాలలో పార్టీకోసం, ప్రజలకోసం కోటేశ్వరరావు ముందు నిలిచారని అన్నారు. విద్యార్థి దశనుండే ఎస్ఎఫ్ఐలో క్రియాశీలకంగా పనిచేశారని, విద్యార్థుల సమస్యలపై పోరాటాలు నడిపి సత్తెనపల్లి ప్రాంతంలో జన విజ్ఞాన వేదిక ఏర్పాటులో కీలకంగా వ్యవహరించి అనేక కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారని, గ్రామంలో జరిగిన అనేక పోరాటాల్లో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారని చెప్పారు. ముఖ్యంగా శిస్తు రద్దుకు, రోడ్డు నిర్మాణం పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారని, ప్రజలతో మమేకం కావడం, చొరవతో పార్టీ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్ మాట్లాడుతూ కోటేశ్వరరావు ఫణిదం గ్రామంతోపాటు సత్తెనపల్లి మండలంలో పార్టీ నిర్వహించిన అన్ని కార్యక్రమాల్లో ముందు నిలిచారన్నారు. ఆయన కుటుంబం మొత్తాన్ని పార్టీ వెంటే నిలిపారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని అన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం ఫణిదం శాఖ కార్యదర్శి వి.తులసీరామ్, నాయకులు ఆర్.పూర్ణచంద్రరావు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావు, సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరాజు, ఎం.హరిపుతురాజు, సిపిఎం నాయకులు జె.రాజ్‌కుమార్, కె.జగన్మోహన్‌రావు, కె.వెంకటేశ్వర్లు, షేక్ హుస్సేన్‌షా, డి.నాగేశ్వరరావు ఉన్నారు.

పొగాకు రైతుల కోసం ఫోన్ నంబర్లు

ప్రజాశక్తి-చిలకలూరిపేట : అనేక ఉద్యమల తర్వాత పొగాకు కంపెనీలతో ప్రభుత్వం మాట్లాడి పొగాకు కొనుగోలుకు ఒప్పించిందని, కొన్ని ఫోన్ నంబర్లు ప్రకటించిందని నల్లమడ రైతుసంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ బర్లీ పొగాకును అమ్ముకునే ందుకు తగిన సౌకర్యంగా ఉంటుందో, ఎక్కడ కొనుగోలు కేంద్రాలు ఉన్నాయో, ఏ కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయో తెలుసు కునేందుకు ఈ కింది నంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఎం.రమేష్, అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చ రల్ 8331056024, కె.నాగలక్ష్మి జ్యోతి, మార్కెటింగ్ 9182361396, ఎ.ఉన్నికృష్ణ, పొగాకు బోర్డు 8331832171, ఎన్.శ్రీనివాసరావు ఇండియన్ టొబాకో 97 03380766 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని, పొగాకు అమ్మే సందర్భంలో ఎదురయ్యే సమస్యలను కూడా చెప్పొచ్చని తెలిపారు.

కార్మికుల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : ప్రపంచ కార్మిక దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మాచర్ల మండల న్యాయ సేవల కమిటీ



ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కంభంపాడులో కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎస్. శ్రీనివాస కళ్యాణ్ వివిధ అంశాలపై వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.రమేష్‌బాబు, సీనియర్ న్యాయవాది వై.కృష్ణమూర్తి, ఎపిడిఒ కె.మల్లిఖార్జునరావు, ఎంఎల్ఎస్‌సి సభ్యుడు ఎం.గోవిందరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు 291, ఎస్పీకి 77 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ సూరజ్, డిఆర్ఒ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుండి 291 అర్జీలను స్వీకరించారు.

నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి 77 ఫిర్యాదులను ఎస్.పి కె.శ్రీనివాసరావు స్వీకరించారు. కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసం మొదలగు ఫిర్యాదులు ఎక్కువగా అందాయి. వీటికి తగిన ప్రాధాన్యమిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని పోలీసుల అధికారులను ఎస్పీ ఆదేశించారు.



భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు.

ప్రేమ పేరిట నమ్మించి గర్భవతిని చేసి తీరా పెళ్లి చేసుకోకుండా మొహం చాటేసిన గుంటూరుకు చెందిన బాలఏసుతో లాలాపేట పోలీసులు మందలించి పెళ్లి చేశారని, అప్పటి నుండి నిత్యం మద్యం సేవించి విచక్షణా రహితంగా కొట్టి, చిత్ర హింసలకు గురిచేస్తున్నాడని క్రోసూరు మండలం దొడ్లేరుకు చెందిన కారుమంచి శిరీష ఫిర్యాదు చేశారు. తన భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని విడాకుల కోసం వేధిస్తున్నాడని చెప్పారు. తమకు పుట్టిన బిడ్డ విషయంలోనూ అవమానకరంగా మాట్లాడుతూ డబ్బు, బంగారు నగలు తీసుకొని గెంటేశాడని వాపోయారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు

మట్టి అమ్ముకుని డబ్బులు ఇవ్వడం లేదు

నరసరావుపేట మండలం కాకాని గ్రామానికి చెందిన కొర్నెపాటి బుల్లెబ్బాయి తనకు చెందిన ఎకరం భూమిలో మట్టి తోలుకోవడానికి రూ 1.70 లక్షలకు అదే గ్రామానికి చెందిన వేమవరపు కొండయ్య, శివకు ఇవ్వగా మట్టి అమ్ముకుని డబ్బులు ఇవ్వడం లేదని, ఇదేమని ప్రశ్నిస్తే దూషించి, దాడి చేశారని, చంపుతామని బెదిరిస్తున్నారని బుల్లెబ్బాయి ఫిర్యాదు చేశారు. దీనిపై తాను గతంలోనే రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెప్పారు.

పాలపర్రు మృత వీరులకు ఘన నివాళి

అమరుల స్ఫూర్తితో 20న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని నాయకుల పిలుపు

ప్రజాశక్తి - పెదనందిపాడు


పాత బాపట్ల తాలుకా మఅతవీరుల స్ఫూర్తితో మే 20న జరిగే దేశ వ్యాపిత కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. సోమవారం పెదనందిపాడు మండలం పాలపర్రు గ్రామంలో జరిగిన పాత బాపట్ల తాలుకా మృతవీరుల స్మారక సభ సిపియం మండల కార్యదర్శి డి. రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఈ ప్రాంతంలో అశువుల బాసిన 14 మంది అమరవీరుల స్మారకార్థం స్థూపాలను నిర్మించి వారి ఆశయ సాధనకోసం ఆ ప్రాంతంలో సిపియం కఅషి చేస్తుందన్నారు. అతి పెద్ద పెట్టుబడిదారీ దేశమైన అమెరికాలని చికాగో నగరంలో పనిగంటల తగ్గింపు కోసం జరిగిన పోరాటంలో ఎర్రజెండా ఉద్భవించిందని, నాటి నుండి కార్మిక పోరాటాలకు గుర్తుగా ఎర్రజెండా ఆవిష్కరించబడుతుందన్నారు. అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ బీజేపీ పాలకులు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల్ని విభజించాలని చూస్తున్నారని, ముస్లింలపై దాడులు జరుపుతున్నారని దేశం నుండి వెళ్లగొట్టే కుట్ర జరుగుతుందని తెలిపారు. వక్ఫ్ చట్టాన్ని తీసుకువచ్చి వారి మసీదులను ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని వాటిని పెట్టుబడిదారులకు లీజుకు ఇచ్చి లబ్ధి పొందాలని చూస్తుందన్నారు కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకు వచ్చిందని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాల బిల్లులు నెలల తరబడి బకాయిలు పెడుతున్నారని, అంగన్‌వాడీలకు 42 రోజుల సమ్మె చేసిన సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్‌చేశారు. కార్మిక, కర్షక సమస్యల పరిష్కారానికి 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు గోగడ హరిబాబు , పోపూరి సుబ్బారావు మాట్లాడుతూ ఆనాడు మఅతవీరులు పేదల కోసం పెట్టి చాకిరి విముక్తి కోసం తమ ప్రాణాలను అర్పించారని అన్నారు. తుమ్మలపాలెం వేలూరు పాలపర్రు ఎడ్లపాడు మానుకొండ వారి పాలెం గ్రామాలలో స్థూపాలు నిర్మించడం జరిగిందని తెలిపారు. అనంతరం సిపిఎం కార్యాలయం నుండి మృతవీరుల స్తూపం వరకు ప్రదర్శన నిర్వహించారు. స్థూపం వద్ద మఅతవీరులకు పూలమాలలు వేసి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ స్మారక సభలో నాయకులు శంకర్రావు, ఆలోకం సుబ్బారావు, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు ,దేవరకొండ శ్రీనివాసరావు, కన్నిగంటి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. సభలో పిఎన్ఎం కళాకారలు గేయాలు ఆలపించారు.



సభలో మాట్లాడుతున్న పాశం రామారావు



సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం శ్రేణులు, నాయకులు,



పది ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన రవీంద్ర భారతి స్కూల్

ప్రజాశక్తి- తాడేపల్లి

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం సమీపంలోని రవీంద్ర భారతి స్కూల్ నూటికి నూరు శాతం ఫలితాలు సాధించినట్లు డైరెక్టర్, కరస్పాండెంట్ షేక్ కమర్ హుస్సేన్ తెలిపారు. 589 మార్కులతో బి ఐశ్వర్య పాఠశాల టాపర్గా నిలవగా కే వెన్నెల 572, ఎన్ షర్మిల 562, సిహెచ్ క్రియాత్ షీఫేరు 547, జి శరణ్య 538 మార్కులతో విజయం సాధించారని చెప్పారు. మరో ఐదుగురు విద్యార్థులు 500 పైగా మార్కులు తో ఉత్తీర్ణత సాధించారని వివరించారు. సబ్జెక్టుల వారీగా తెలుగు 99 మార్కులు, హిందీ 97, ఇంగ్లీష్ 96, మ్యాథ్స్ 100, సైన్స్ 100, సోషల్ వంద మార్కులు సాధించిన విద్యార్థులు కు అభినందనలు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు, ఈ విజయానికి కారణమైన ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేకంగా అభినందించారు.



హామీ నిలబెట్టుకోకపోతే ఆందోళన

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో పొగాకు కొనుగోలు చేస్తామని చెప్పిన హామీనీ నిలబెట్టుకోకపోతే ఆందోళనకు పూనుకుంటామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి కుమార్ అన్నారు. సోమవారం ఫిరంగిపురం మండలంలోని అత్యధికంగా పొగాకు పండించిన తక్కెళ్ళపాడు గ్రామంలో అడగడుగున రోడుపై ఉన్న పొగాకు మండీలను పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 29వ తేదీన గుంటూరు లాంపారంలో జరిగిన చర్చల్లో వ్యవసాయ మంత్రి, రాష్ట్ర అధికారులు ముందు కంపెనీలు పొగాకును కొనుగోలు చేస్తామని తెలిపారని చెప్పారు. కానీ ఇప్పటి వరకు పొగాకు ప్రారంభించకుండా కంపెనీలు నాటకాలు ఆడుతున్నారని సిండికేట్ అయి రైతులును మోసం చేయాలని చేస్తున్నా రన్నారు. ఇదే పద్ధతే కొనసాగితే ఉద్యమం చేపట్టాల్సి వస్తుం దని అన్నారు. అవసరమైతే రోడ్లు దిగ్బంధనం కార్యక్ర మం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి మార్పుల వెంగ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

9న మలినేనిలో మెగాజాబ్‌మేళా

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్ద సహకారంతో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈనెల 9న పుల్లడిగుంటలోని మలినేని పెరుమాళ్ళ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో జరిగే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సుమారు 45 కంపెనీలు పాల్గొంటున్నాయని, 1400 ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. 18-25 మధ్య వయస్సు కలిగిన టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బి.టెక్, డిప్లొమా, పార్మసీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన వారు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్సులు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

సుబ్బారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ తుపాకుల సుబ్బారావు ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు ఘనమైన నివాళి అని సిపిఎం పట్టణ కార్యదర్శి వి వి జవహర్లాల్ అన్నారు. సోమవారం రాత్రి మంగళగిరి పట్టణంలోని ఫూట్ రోడ్లో గల ఎస్సీ కాలనీలో మాజీ కౌన్సిలర్ తుపాకుల సుబ్బారావు ఏడవ వర్ధంతి సందర్భంగా సుబ్బారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం జెండా ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జవహర్లాల్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సిపిఎం అభివఅద్ధికి, పేద ప్రజల సమస్యల పోరాటం వరకు నిరంతరం సుబ్బారావు పనిచేశారని అన్నారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా నిలబడి సిపిఎంని అభివృద్ధి చేయడంలో ముందున్నారని అన్నారు. పోలీసులు అనేక కేసులు పెట్టి ఇబ్బందులు పడ్డప్పుడు సిపిఎంగా ఈ ప్రాంత ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉందని అన్నారు. నేటికీ కేసులు పెడుతున్నప్పటికీ సిపిఎం మాత్రమే అండగా ఉండి కేసులు లేకుండా చేస్తుందని అన్నారు. సుబ్బారావు పేద ప్రజల కోసం నిరంతరం పోరాడిన వ్యక్తిని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకోవడమే నిజమైన నివాళి అని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు పి.బాలకృష్ణ మాట్లాడుతూ పాలకవర్గాలు అవలంబిస్తున్న విధానాల వలన పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఆ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించడమే సుబ్బారావుకు నివాళి అని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలాజీ, వై.కమలాకర్, పట్టణ కమిటీ సభ్యులు టి.శ్రీరాములు, జె.బ్రాహ్మణి, స్థానిక నాయకులు ఈగ సాంబయ్య, ఆర్. వేణు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి వి.వి. జవహర్‌లాల్, సుబ్బారావు విగ్రహానికి నివాళులు

యర్రబాలెంలో ఘనంగా మేడే ఉత్సవాలు

మేడే స్ఫూర్తితో 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు

మంగళగిరి - రూరల్

మేడే ఉత్సవాల సందర్భంగా ఎర్రబాలెం గ్రామంలో సి ఐ టియు ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆటపాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో, కర్రసాములతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు రాజధాని డివిజన్ సిఐటియు నాయకులు ఎం.రవి అధ్యక్షత వహించారు. సభలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతు 24 గంటల కట్టు బానిస పని విధానం నుండి 8 గంటల పని విధానం కోసం పోరాడి సాధించుకున్న పోరాట ఫలితమే మేడే అని చెప్పారు. కేంద్రంలోని బిజెపి లేబర్ కోడ్లను తీసుకువస్తూ కార్మికులు సంక్షేమాన్ని పూర్తిగా పక్కకు నెట్టే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. జీతాల కోసం సమస్యల పరిష్కారం కోసం ఎటువంటి ఆందోళన చేపట్టకుండా ఈ లేబర్ కోడ్ ల చట్టం రూపొందించారని చెప్పారు. వీటికి వ్యతిరేకంగా ఈనెల 20వ తేదీన జరిగే దేశ వ్యాప్త ఆందోళనకు ప్రతి ఒక్కరు మద్దతు ఇవ్వాలని కోరారు. రాజధాని శంకుస్థాపనకు వచ్చిన మోడీ గతంలో మట్టి నీళ్ల ఇస్తే ఇప్పుడు కూడా మరోసారి ఎటువంటి నిధులు కేటాయించలేదన్నారు. స్థానిక నేతలు వీరుడు సూర్యుడు అంటూ ప్రసంగించడం తప్ప రాజధాని నిర్మాణానికి నిధులు ఎందుకు ఇవ్వడం లేదని అడగలేక పోయారన్నారు. వ్యవసాయ అనుబంధ వఅత్తులు పనులు తగ్గిపోయాయని పనులు దొరకని పరిస్థితి ఏర్పడు తున్నాయని ఈ క్రమంలో ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి వేతనాన్ని పెంచి వర్తింపజేయాలని కోరారు కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లడుతున్న ఉమామహేశ్వరరావు



, జెండా ఆవిష్కరణ



కర్రసాము ప్రదర్శన



కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు



ఈపోస్ యంత్రాలు అందిస్తున్న జేడి కృపాదాస్, డీఏఓ వెంకటేశ్వర్లు

ఎరువుల రిటైల్ డీలర్లకు ఉచితంగా ఈపోస్ మిషన్లు

ప్రజాశక్తి - గుంటూరు

పరదీప్ ఫోస్పేట్ లిమిటెడ్ (పి.పియల్), కోరోమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంయుక్తంగా జిల్లాలోని రిటైల్ ఎరువుల డీలర్లకు అధునాతన ఈపోస్ (అమ్మకం యంత్రాలు) ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ కార్యాలయ సంయుక్త వ్యవసాయ సంచాలకులు వి.డి.వి. కృపాదాస్, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఎడిఎలు టి.శ్రీనివాసరావు, జయదేవ్ రాజన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎరువుల డీలర్ల సంఘం అద్యక్షులు వి.నాగిరెడ్డి, పిపియల్ ప్రతినిదులు పి.వి.సుభాష్, ఎస్.కె.మహమ్మద్ రఫీ, జిల్లాలోని ఎరువుల డీలర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా కృపాదాస్, డిఎఒ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిపిఎల్, కోరమండల్ వారు రూ.27వేలు విలువైన 276 ఈపోస్ యంత్రాలను జిల్లాలో రిటైల్ డీలర్లకు ఉచితంగా అందిస్తున్నారని, ఇవి కాక ఇవికాక ఇంకా 400 యంత్రాలు రానున్న రోజుల్లో అందుబాటులోకి వస్తాయన్నారు.

కార్మిక హక్కుల రక్షణ కోసం 20న సార్వత్రిక సమ్మె

హక్కులను కాలరాస్తున్న మోడీ - లేబర్ కోడ్లను రద్దు చేసే వరకూ పోరాటం

సమ్మె జయప్రదం కోసం కార్మిక సంఘాల సదస్సులో సిఐటియు పిలుపు



జిల్లా స్థాయి సదస్సులో మాట్లాడుతున్న ఆంజనేయులు నాయక్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్వాతంత్రం కంటే ముందే పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మిక హక్కులను కాల రాసేందుకు బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని లేబర్ కోడ్ల రద్దు కోసం భారతదేశ కార్మిక వర్గం మొత్తం ఉద్యమించాలని సిఐటియు పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ పిలుపునిచ్చారు. ఈనెల 20న జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జయ ప్రదానికై వివిధ సంఘాల నాయకులతో జిల్లా స్థాయి సదస్సు సోమవారం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ సమ్మెకు సంఘ టిత, అసంఘటిత రంగ కార్మి కులు భారతదేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సన్నద్ధం అవుతున్నారని తెలిపారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నూతన కార్మిక కోడ్ల పేరుతో నాలుగు కోడ్లను తీసు కోవచ్చి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వం, కార్మికులను లక్ష్యంగా చేసుకుని కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా తీసుకున్న విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. స్థూల జాతీయోత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తూ భారతదేశ అభివృద్ధిలో కార్మిక శ్రమ కీలక పాత్ర పోషిస్తుందని కానీ పాలకవర్గ విధానాల వల్ల శ్రమ కు తగ్గ ఫలితం దక్కడం లేదని విమర్శించారు. లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికుల కు సమ్మె చేసే హక్కు, ప్రశ్నిం చే హక్కు, ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు, యూనియన్స్ పెట్టుకొనే హక్కులను అన్ని విధాలుగా కార్మికులు తీవ్రంగా నష్ట పరిచే కార్మిక వ్యతిరేక విధానాలను అవలం బిస్తున్న బిజెపి విధానాల ను వ్యతిరేకించాలని జరుగుతున్న ఈ సమ్మెను జయప్రదం చేయాలన్నారు.

ఏఐటీయూసీ నాయకులు కాసా రాంబాబు మాట్లా డుతూ ప్రభుత్వ, ప్రయివేటు రంగంలో పని చేస్తున్న కార్మికులు ఉద్యోగుల శ్రమను దోపిడీ చేసి కోట్లాది రూపా యలు లాభాలు గడిస్తున్న కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న బిజెపి విధానాలపై ఐక్యంగా ఉద్యమించాల న్నారు. కార్మికులు, ఉద్యోగస్తులు చాలీచాలని వేతనాలతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్న వారి సమస్యల పరి ష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్మిక వర్గ రక్షణ కోసం దేశ వ్యాప్త కార్మిక సంఘాలు అన్ని ఒక్క తాటి పైకి వచ్చి పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కార్మిక హక్కుల రక్షణ కోసం, ప్రజా శ్రేయస్సు కోసం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడడం కోసం, జరుగుతున్న మే 20తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెజయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుం టూరు విజయ్‌కుమార్, అధ్యక్షులు కె. హనుమంత రెడ్డి, రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాల రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి రవిబాబు, రాష్ట్ర నాయకులు అనుముల లక్ష్మీశ్వర రెడ్డి, కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి. శివ కుమారి, ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి. మల్లీశ్వరి, పిడిఎం నాయకులు వెంకటేశ్వరరావు, ఎంసి పిఐయు నాయకులు రెడ్ బాషా, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు కె. కృష్ణ, గిరిజన సంఘం నాయ కులు కోటానాయక్, ఏఐటీయూసి నాయకులు రంగయ్య, పాల్గొన్నారు.

వికలాంగులకు రుణాల మంజూరులో ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి



ఎంపిడిఓకు వినతిపత్రం అందజేస్తున్న రాజేష్‌కుమార్,

ప్రజాశక్తి - అచ్చంపేట

ప్రభుత్వ రుణాల మంజూరులో దివ్యాంగులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ "కౌన్సిల్ ఫర్ సిటి జన్ రైట్స్" రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిర్రా రాజేష్ కుమార్, అచ్చంపేట ఎంపీడీఓ కొయ్య శ్రీనివాసరావుకి సోమ వారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ, "దివ్యాంగుల హక్కుల చట్టం 2016" ప్రకారం ప్రభుత్వం దివ్యాంగులకు ఉపాధి, ఆర్థిక సహా యం రంగాలలో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత కలిగి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దివ్యాం గులు రుణాల ద్వారా స్వావలంబనకు దారి తీసే అవకాశాన్ని కల్పించేందుకు వారి కోటాలో మంజూరు చేయాల్సిన నిధులను సమర్థవంతంగా అందించాలని ఆయన కోరారు. అన్ని గ్రామీణాభివృద్ధి శాఖ పథకాలలో దివ్యాం గుల హక్కులను పరిగణనలోకి తీసుకుంటూ, ప్రత్యేక మార్గదర్శకాలను అమలు చేయాలని ఆయన తెలిపారు.

ఆస్తమా పట్ల అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ సాయికృష్ణ



మాట్లాడుతున్న డాక్టర్ సింగరాజు సాయికృష్ణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఆస్తమా వ్యాధి పట్ల అప్ర మత్తంగా ఉండాలని ప్రముఖ ఊపిరితిత్తుల వ్యాధి నిపుణులు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ఎండి పల్మనాలజి ఎండి అన్నారు. సోమవారం సత్తెనపల్లి పట్టణం లో నరసరావుపేట రోడ్లో ఉన్న సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ ఆసు పత్రి ప్రాంగణంలో ప్రపంచ ఆస్తమా దినోత్సవం పుర స్కరించుకొని ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సింగరాజు సాయికృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో రోజు రోజుకీ పెరుగుతున్న వాయుకాలుష్యం, ఆహార పదార్థాల్లో వాడే రసాయనాలు కారణంగా ఉబ్బసం వ్యాధి రోగులు ప్రపంచ వ్యాప్తిగా దాదాపు 262 మిలియన్ రోగులు ప్రతి సంవత్సరం ఈ వ్యాధి బారిన పడుతున్నారని అన్నారు. ఈ వ్యాధి లక్ష ణాలు శ్వాస తీసుకోవడం ఇబ్బంది, ఛాతి బిగుతుగా అవుతూ, శ్లేష్మంతో కూడిన దగ్గు, పిల్లి కూతలు వంటివి వ్యాధి లక్షణాలుగా కనబడతా యని అన్నారు. ఆస్తమా రోగులు ట్రీట్మెంట్ పట్ల ముందుగా అవ గాహన కలిగి ఉండాలి. జన్యు పరంగా, ఎలర్జీ లక్షణాలు స్థూల కాయం ఉన్నవారితో పాటు, ఎక్కువగా గాలి కాలుష్యం బారిన పడేవారు, దుమ్ము ధూళి అధికంగా ఉన్న ప్రదేశం లో నివసించేవారు ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉంద న్నారు. సరైన మందులు వాడుకోవడం వల్ల ఈ వ్యాధి నుంచి రక్షణ పొంది మన జీవనప్రమాణ శైలిని కాపాడు కోవచ్చు అని అన్నారు. ఈ అవగాహనా కార్యక్రమంలో మరొక ప్రముఖ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ సింగరాజు విద్య మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎండ తీవ్రత పెరుగుతుందని వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు.



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

పశువుల ఎరువు అభివృద్ధిపై అవగాహనకు ప్రదర్శన

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని మాదల గ్రామంలో ఆచార్య ఎన్.జి.రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు తమ గ్రామీణ కృషి అనుభవం ఆర్ఎడబ్ల్యుఈ కార్యక్రమంలో భాగంగా ట్రైకోడర్మా విరిడీ ఫ్యూడోమోనాస్ ఫ్లోరె సెన్స్‌తో పశువుల ఎరువు అభివృద్ధిపై పద్ధతి ప్రదర్శన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం నరసరావుపేట ఏరు వాక కేంద్రం సాంకేతిక సహకారంతో జరిగింది. ఈ సందర్భం గా విద్యార్థులు పశువుల ఎరువును జీవ సూత్ర జీవులతో అభి వృద్ధి చేయడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ట్రైకోడర్మా విరిడీ మట్టిలో ఉన్న శిలీంధ్ర జన్య వ్యాధులను నియంత్రించడం లో సహాయపడుతుందని, ఫ్యూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ హానికర జీవులను నిరోధించి మొక్కల అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని తెలి యజేశారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహా యకులు విద్యార్థులు టి.రేణుక, జె.సుమలి, కె.వి.క్రిష్ణవేణి, బి.వర్షిణి స్వరాజ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేని సత్కరిస్తున్న గ్రామస్తులు

కంకణాలపల్లి తిరునాళ్లలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామం వావిలాల నగర్‌లో ముత్తి మారియమ్మన్ అమ్మవారి తిరణాల మహోత్స వంలో సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ సోమ వారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారా యణకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయ కులు సోలనంబి, కోమటినేని శ్రీనివాసరావు, మోహన్, దరు వూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పాకాల పాడు పీసెస్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని చేసు కోవాలని పాకాలపాడు ప్రాథమిక పరపతి సంఘం అఫీషియల్ పర్సన్ ఇన్చార్జి ఎంవి నరసయ్య విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025లో భాగంగా పల్నాడు జిల్లా సహ కార శాఖ అధికారి ఆదేశాల మేరకు సోమవారం పాకాల పాడు పిఎసిఎస్ కార్యాలయంలో ఆధార్ ఎన్రోల్మెంట్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఆధార్ సెంటర్‌ను పర్సన్ఇన్చార్జి ఎంవి నరసయ్య ప్రా రంభించారు. పాకాలపాడు పిఎసిఎస్ సీఈవో అన్నదాసు సాయిబాబు, సచివాలయం డిఐ కే.చలపతిరావు సంఘ సిబ్బం ది పాల్గొన్నారు.



అభినందన సభలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఉత్తమ విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను స్థానిక రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అభినందన సభను నిర్వహించినట్లు ఆ సంఘ అధ్యక్షులు జక్కుల లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన పది పరీక్షలలో ఉన్నత ఫలితాలు సాధించిన 20 మంది విద్యార్థులకు సంఘనాయకులు నగదుతో పాటు మేడల్స్ అం దించారు. ఎంతో కృషి చేసిన ప్రార్దన ఉపాధ్యాయురాలతో పాటు మరికొందరు ఉపాధ్యాయులను సంఘ నాయకులు సత్కరిం చారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యారాలు మాధవీ లత మాట్లాడుతూ ఇటువంటి బహుమతులు మీలో మరింత ఉత్తేజా న్ని నింపాలని మిగతా విద్యార్థులకు స్ఫూర్తిని కలిగిస్తుం దన్నా రు. విద్యాతోనే ఉన్నత భవిషత్‌లకు మార్గం సుగమం అవు తుందని సంఘ అధ్యక్షులు లక్ష్మీ నారాయణఅన్నారు. కార్యక్రమం లో సంఘ ప్రధాన కార్యదర్శి కె బి అర్జె ప్రసాద్, పోతు లూరయ్య, మురహరి రావు, బి.రామారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పారితోషకాలను, మేడల్స్‌ను బి కమలాకర్‌రావు స్పాన్సర్ చేశారు.



తాము వేసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో డ్రాయింగ్, మ్యూజికల్ చైర్స్ పోటీలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థుల్లో ఉత్సాహం నింపేందుకు సోమవారం పట్టణంలోని మాచర్ల శాఖా గ్రంథాల యంలో డ్రాయింగ్, గేమ్స్ నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కె.ఫణిభూషణ్ ఆధ్వర్యంలో పిల్లలందరూ కలిసి మంచి రంగుల తో డ్రాయింగ్ వేశారు. మ్యూజికల్ చైర్స్, కలర్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం వారు వేసిన డ్రాయింగ్స్ ప్రదర్శించారు. కార్యక్రమం లో జిల్లా పరిషత్ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పారిశుధ్య కార్మికులకు ప్రొఫైలింగ్ క్యాంపు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నమస్తే పథకం కి సంబంధించి వ్యర్థాలను సేకరించే కార్మికులు, కాంట్రాక్టు పారి శుధ్య కార్మికులకు మంగళవారం ప్రొఫైలింగ్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు పురపాలక సంఘ కమిషనర్ డి. వేణుబాబు సోమ వారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికులు ఉపాధి, జీవన భద్రత, సామా జిక న్యాయం చేసేందుకు నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ ఎకో సిస్టమ్ (సమేస్తే)ను రూపొందించినట్లు తెలిపారు. వ్యర్థాలను సేకరించే కార్మికులు ఈ పథకంలో తమ పేర్లు నమోదు చేయిం చు కుంటే వారికి ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచిత వైద్యం, వారి పిల్లలకు స్కాలర్ షిప్స్, మెరుగైన జీవనం కోసం రుణాలు వంటి సదుపాయాలు అందిస్తారని తెలిపారు. ఎపి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని స్వఛ్ఛాంధ్ర కార్పోరేషన్ ఆధ్వర్యంలో పైలెట్ ప్రాజెక్ట్ నిర్వహిస్తుందన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మున్సి పల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించే ప్రొఫైలింగ్ క్యాం పులో పారిశుధ్య కార్మికులు పాల్గొని లబ్ది పొందాలని కోరారు.

జీవో నెంబర్ 77ను రద్దు చేయకుండా ఐసెట్ పరీక్ష నిర్వహిస్తే అడ్డుకుంటాం

ప్రజాశక్తి - మంగళగిరి

జీవో నెంబర్ 77ను రద్దు చేయకుండా ఐసెట్ పరీక్ష నిర్వహిస్తే అడ్డుకుంటామని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పూర్ణిమ లక్ష్మి సోమవారం మంగళగిరిలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రద్దు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హర్షవర్ధన్, శాంతి స్వరూప్, కుందన శ్రీ పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ఛైర్మన్ అన్నాబత్తుని శివకుమార్

విప్రో సంస్థకి ఎంపికైన ఎఎస్ఎన్ విద్యార్థులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ప్రముఖ ఐటి సంస్థ విప్రో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఆఖరి సంవత్సరం చదువుతున్న 11 మంది బిసిఎ, బిఎస్సి, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు ఎంపికైనట్లు సంస్థ ఛైర్మన్ మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక వీఎస్ఆర్ కళాశాలలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శివకుమార్ వివరాలు వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రాంచంద్ మాట్లాడుతూ వర్చువల్ విధానంలో జరిగిన క్లిష్టమైన ఇంటర్వ్యూలో పదకొండు మంది విద్యార్థులు ఎంపికవ్వడం ముదావహమన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

అన్నదానం కార్యక్రమం

ప్రజాశక్తి - చేబ్రోలు



మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుమల శెట్టి గురుమూర్తి జ్ఞాపకార్థం నిడుబ్రోలు రైల్వే స్టేషన్ దగ్గర ఉంటున్న పేదవారికి అన్నదాన కార్యక్రమం చేయటం జరిగింద సమస్త అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమాశంకర్ తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమం చేయడానికి సహకరించిన గురుమూర్తి కుమారుడు తిరుమల శెట్టి అజయ్‌కి కుమార్తె కల్పనకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరీ చిలకపాటి సింహాద్రి ఈసీ నెంబర్ పోలిశెట్టి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అరటి తోటను పరిశీలిస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు

రైతులకు నష్టపరిహారం అందించాలి

ప్రజాశక్తి - తాడేపల్లి

ఆదివారం కురిసిన ఆ కాల వర్షాలు, ఈదురు గాలులతో తాడేపల్లిలో అరటి పంట వేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి లక్ష రూపాయలు నష్టపరిహారం ప్రభుత్వం వెంటనే అందించాలని వైసీపీ మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లిలోని ఎన్టీఆర్ కట్ట, రైల్వే క్యాబిన్, మహానాడులోని దెబ్బతిన్న అరటి తోటలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బి.రుక్మంగారెడ్డి, టి.నారాయణ రెడ్డి, డి.వీరారెడ్డి, ఎం.ప్రసాద్ రెడ్డి, డి.శివరామిరెడ్డి, బి.శరన్ కుమార్ రెడ్డి, ఆర్.శ్రీనివాసరాజు, ఈశ్వరరావు, బాలకోటయ్య, రాజమోహన్, కళ్యాణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల వికాసం కోసమే సమ్మర్ క్యాంపులు

ప్రజాశక్తి - పెదకాకాని

స్థానిక గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థుల వికాసం కోసం సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేశామని గ్రంథాలయాధికారి వేముల విజయ్ కుమార్ సోమవారం తెలిపారు. విజయ్ మాట్లాడుతూ ్యాంపులో పుస్తక ప్రదర్శన విద్యార్థులచే పలు నీతి కథలు చదివించి వినిపిస్తామన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ పాటిబండ్ల హనీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంకు ఎక్సలెంట్ ప్లేస్ మెంట్ అవార్డు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి మరో ప్రతిష్టాత్మకమైన పురస్కారం లభించింది. ఆసియా టుడే మీడియా సంస్థ తన 15వ అంతర్జాతీయ విద్యా సదస్సును ఆదివారం సాయంత్రం న్యూఢిల్లీలో నిర్వహించింది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల ప్లేస్ మెంట్ గణాంకాలను పరిశీలించిన ఆసియా టుడే మీడియా సంస్థ బెస్ట్ ప్లేస్ మెంట్ టైటిల్‌ను ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ప్రకటించింది. 100 శాతం ప్లేస్మెంట్ రికార్డును ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ సొంతం చేసుకుంది. సగటున రూ.9.38 లక్షల వార్షిక వేతనాలు విద్యార్థులకు లభించేలా శిక్షణ అందించింది. యూనివర్సిటీ ప్లేస్మెంట్ రికార్డులను పరిశీలించిన ఆసియా ఉండే మీండియా సంస్థ ఎక్సలెంట్ ప్లేస్మెంట్ అవార్డును ప్రకటించింది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న యూనివర్సిటీ కార్పొరేట్ రిలేషన్స్ అండ్ కెరీర్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ వివేకానందన్ కేంద్ర జలశక్తి మంత్రి రాజభూషణ్ చౌదరి. ఫిజి రిపబ్లిక్ హైకమిషన్ కౌన్సిలర్ నిలేష్ రోనిల్, ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సీఆర్ సీఎస్ డైరెక్టర్ వివేకానందను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా అభినందించారు.



కేంద్రమంత్రి చేతుల మీదుగా అవార్డును స్వీకరిస్తున్న డాక్టర్ వివేకానందన్

వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ప్రజాశక్తి - తాడికొండ

వికలాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వారికోసం కొత్త చట్టాలు వచ్చాయని స్థానిక శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏడిఐపీ పథకం ద్వారా వయోవృద్ధులకు, దివ్యాంగులకు ఉపకరణాల మరియు సహాయక పరికరాల ఉచిత పంపిణీ కొరకు గుర్తింపు శిబిరమును నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగులను ఉద్దేశించి శ్రావణ కుమార్ మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకుల తలసిల ప్రసన్న, గుంటుపల్లి మధుసూదన్ రావు, ఎంపీడీవో కె.సమత వాణి, నాలుగు మండలాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు మంగళగిరి లిఫ్టర్లు

ప్రజాశక్తి - మంగళగిరి

ఈనెల 5 తేది నుండి 12 తేదీ వరకు ఉత్తరరాఖండ్ డేహరడూమ్ లో జరిగే ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ మెన్ & ఉమెన్ క్లాసిక్, ఎక్వ్యాప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ , ఏషియన్ యూనివర్సిటీ కప్ క్లాసిక్, ఎక్వ్యాప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనే ఇండియన్ పవర్ లిఫ్టింగ్ టీమ్ లో ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా నుండి నలుగురు మహిళా పవర్ లిఫ్టర్స్ ఎంపికయ్యారని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కర రావు, ప్రధాన కార్యదర్శి షేక్ సందాని సోమవారం తెలియజేశారు. ఈ పోటీల్లో ఏషియన్ జూనియర్ ఎక్వ్యాప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో మంగళగిరి చెందిన అంతర్జాతీయ క్రీడాకారిని షేక్ సాదియా అల్మస్ 57 కేజీ విభాగంలో, తెనాలికి చెందిన అంతర్జాతీయ క్రీడాకారిని షేక్ షబీనా 84కేజీ విభాగం లో పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఏషియన్ జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో తెనాలి చెందిన అంతర్జాతీయ క్రీడాకారిని ఎం. షానున్ 53 కేజీ విభాగంలో, తెనాలి చెందిన మరో అంతర్జాతీయ క్రీడాకారిని నాగం జ్ఞాన దివ్య ०84 కేజీ విభాగంలో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఏషియన్ యూనివర్సిటీ కప్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో ఎం. షానున్, నాగం జ్ఞాన దివ్య, ఏషియన్ యూనివర్సిటీ కప్ ఎక్వ్యాప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలో షేక్ షబీనా పాల్గొంటారన్నారు.



పోటీలకు ఎంపికైన పవర్ లిఫ్టర్లు

కులగణనపై కేంద్ర నిర్ణయం పట్ల హర్షం

ప్రజాశక్తి- తాడేపల్లి

దేశంలో జనాభా లెక్కల తో పాటు వివిధ సామాజిక వర్గాలు కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరయ్య యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం తాడేపల్లి టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుల గణన వల్ల సామాజిక న్యాయం జరగటంతో పాటు దామాషా ప్రకారం చట్టసభల్లో ప్రాతినిధ్యం కూడా దొరుకుతుందని చెప్పారు. సమావేశంలో టిడిపి పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ మండల గోపాలరావు, మంగళగిరి నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు గోలి చెవిరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపి పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ మండవ గోపాలరావు, మంగళగిరి నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు గోలి శౌరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

అంజుమన్‌కు మార్చురీ బాక్స్, జనాజా సెట్లు వితరణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి అంజుమన్ కార్యాలయంకు స్థానిక తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ హుస్సేన్ తన తండ్రి షేక్ ఉద్దండ సాహెబ్ జ్ఞాపకార్థం 1,50,000 రూపాయలు విలువ చేసే ఏసి వీఐపీ మార్చురీ బాక్స్, రెండు జనాజా సెట్లు అందజేశారు. అంజుమన్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ అక్రమ్, అంజుమాన్ అధ్యక్షులు షేక్ అల్తాఫ్, కార్యదర్శి హనీఫ్ షా ఖాదరిలకు మార్చురీ బాక్స్, రెండు జనాజా సెట్లను దాతలు షేక్ హుస్సేన్ ఇంతియాజ్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దాతలు హుస్సేన్ కుటుంబ సభ్యులు ముస్లింలు చనిపోయినప్పుడు ఉపయోగించుకునే మార్చురీ బాక్స్, రెండు జనాజా సెట్లు ఇవ్వడం అభినందనీయమన్నారు.



అంజుమన్ కు మార్చురీ బాక్స్, జనాజా సెట్లు అందజేసిన హుస్సేన్



చోరీ జరిగిన షాపు

డెయిరీ షాపులో చోరీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని మెయిన్ బజార్‌లోని సరోజినీ మిల్క్ డైరీ పార్లర్ నందు ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుకాణ యజమాని టీ శైలజ తెలిపిన వివరాల మేరకు... ఆదివారం రాత్రి 10.30 గంటలకు యధావిధిగా దుకాణాన్ని మూసి వేశారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు పాలు విక్రయించేందుకు వచ్చి చూడగా దుకాణ షట్టర్ పగలగొట్టి ఉంది. దుకాణం లోపలికి వెళ్లి చూడగా గల్లా పెట్టిలోని రూ. 20 వేలు నగదు, బంగారు వెండి వస్తువులు మాయమైనట్లు గమనించారు. దుకాణ షట్టర్ గల్లా పెట్టి పగలగొట్టిన రాడ్డు దొండకుడు దుకాణంలోనే పడవేసి పరాయనట్లుగా తెలుస్తోంది. 20000 రూపాయలు నగదు తో పాటు అపహరించకపోయిన బంగారు వెండి వస్తువులు విలువ 80,000 ఉంటుందని బాధితులు తెలిపారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న సాంబశివరావు

ఉచిత మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీకాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళగిరి గౌతమబుద్దా రోడ్డు వద్ద సగర సంఘం కార్యాలయం ప్రాంగణంలో సోమవారం ట్రస్ట్ ఛైర్మన్, మంగళగిరి సగర సంక్షేమ సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సాంబశివరావు మాట్లాడుతూ వేసవిలో ప్రతి సోమవారం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో కర్నాటి శివసత్యనారాయణ, నంగళం ప్రసాద్, కళ్ళం శివసాంబిరెడ్డి, కగ్గా శ్రీనివాసరావు, పంచల శివన్నారాయణ, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, నల్లమోలు నాగరాజు, బేతపూడి మధుబాబు, బోనేపల్లి తాండవ, చిరుమామిళ్ళ రంగారావు, రెడ్డి వీరరాఘవులు, నంద్యాల గోపాలకృష్ణ, ఉద్దంటి మురహరిరావు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

153వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎ సి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం చేస్తున్న దీక్షలు సోమవారం నాటికి 153వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఏ విజయశ్రీ, డి.రమణ, డి.సువర్ణ కుమారి, వి.లక్ష్మి, ఈ.శారమ్మ కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, టి నాగేశ్వరరావు, వై.రమాదేవి, టి.దుర్గ భవాని ప్రారంభించారు. కార్మికులు, యాజమాన్యం చర్చలకు కూర్చోబెట్టి సామరస్య వాతావరణంలో పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్. పిచ్చయ్య, ఎన్.సుబ్బారావు, వై,సాంబయ్య, డి.మాణిక్యారావు, ఎం.గుర వయ్య, డి.నాగేశ్వరరావు, ఎస్.కె.ఇమాంబి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలపై విస్తృత అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యాహక్కు చట్టం 2009, సెక్షన్ 12(సి) ప్రకారం ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఈనెల 2 నుండి ప్రారంభమైనందున మండల స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. సోమవారం విద్యాహక్కు చట్టం ఉచిత ప్రవేశాలపై కలెక్టర్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానంపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. మే 19వ తేదీలోగా తమ వివరాలు https//cse.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 1వ తరగతిలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న, బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉందన్నారు. సిబిఎస్ఈ, ఐసిఎస్ఈ, ఐబి సిలబస్ ఉన్న పాఠశాలల్లో ప్రవేశానికి 2025 మార్చి 31 నాటికీ, స్టేట్ సిలబస్ ఉన్న పాఠశాలల్లో 2015 జూన్ 1 నాటికి ఐదేళ్లు నిండి ఉండాలన్నారు. ఈనెల 29న లాటరీ ద్వారా మొదటి విడత సీట్ల కేటాయింపు ప్రకటన చేయబడుతుందన్నారు. కార్యక్రమంలో జేసీ భార్గవ్‌తేజ, డిఆర్ఒ ఖాజావలి, ఆర్‌డిఒ శ్రీనివాసరావు, డిఇఒ సి.వి.రేణుక, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమ్మె శిబిరంలో సిహెచ్‌ఒలు

సిహెచ్‌ఓల నిరవధిక సమ్మె ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

నేషనల్ హెల్త్ మిషన్‌లో గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న సిహెచ్‌ఓ (ఎంఎల్‌హెచ్‌పి)ల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపిఎంసిఎ) ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె ప్రారంభం అయ్యింది. దీనిలో భాగంగా గుంటూరు కలెక్టరేట్ ఎదుట సోమవారం సమ్మె శిబిరం ఏర్పాటు చేశారు. అసోసియేషన్ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లింగరాజు, ఉపాధ్యక్షులు వనజ, ట్రెజరర్ సంధ్య మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం పెంపుదలతో వేతన సవరణ చేయాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రబద్ధీకరించాలని, ఈపిఎఫ్‌ఓను పునరుద్ధరించాలని, క్లినికల్ అద్దె బకాయిలు వెంటనే చెల్లించాని, నిర్ధిష్టమైన జాబ్‌చార్ట్ అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని తదితర డిమాండ్లతో గత నెల రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నుండి స్పందన లేకపోవటంతో సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. సమ్మెకు సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజి మద్దతు తెలిపి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎంలోని క్యాడర్లకు ఎంటిఎస్ అమలు చెయ్యకుండా వివక్ష చూపుతుందన్నారు. 2022 వరకు రాష్ట్ర ప్రభుత్వ శాఖలలోని కాంట్రాక్ట్ ఉద్యోగులతో సమానంగా ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని క్యాడర్లకు ఎంటిఎస్ అమలు చేశారని, గత 15 ఏళ్ళుగా అమలైన ఈ విధానానికి గత ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. దీని వలన ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని క్యాడర్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ విధి విధానాల ప్రకారం హ్యూమన్ రిసోర్స్ పాలసీ అమలు చెయ్యాలి. దానిని కూడా రాష్ట్రప్రభుత్వం అమలుచెయ్యడం లేదు. వెంటనే అమలు చెయ్యాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పిలు ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాలలో వారి విధులు వారు నిర్వర్తించకుండా అదనపు పనిభారం మోపుతున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వలనే వారి సమ్మె అనివార్యమైందన్నారు. కనుక రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎంఎల్‌హెచ్‌పిల సంఘాల ప్రతినిధులందరితో చర్చించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే సిఐటియు ప్రత్యక్ష ఆందోళనలో భాగస్వామి అవుతుందని హెచ్చరించారు. ఎఐటియుసి నాయకులు వై.రాధాకృష్ణమూర్తి మద్దతు తెలిపారు.

మంత్రి నారా లోకేష్ నివాసంలో ప్రజా దర్బార్

సమస్యలు విన్నవించేందుకు రాష్ట్ర వ్యాప్తగా తరలివచ్చిన ప్రజలు

ప్రజాశక్తి - తాడేపల్లి

సుదీర్ఘ విరామం తర్వాత ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ సోమవారం 61వ రోజు ప్రజా దర్బార్ నిర్వహించారు. సమస్యలు చెప్పుకునేందుకు సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చా రూ. ప్రతి ఒక్కరిని పలకరించి అర్జీలు స్వీకరించారు. సమస్యలు వెంటనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. పెన్షన్, భూ సంబంధిత సమస్యలు, ఉద్యోగం, ఉపాధి, వైద్యం, ఆర్థిక సాయం కోసం ప్రజలు అర్జీలు అందజేశారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని అంబేద్కర్ యూనివర్సిటీలో పనిచేస్తుండగా తన భర్త విద్యుత్ షాక్ కు గురై 2020లో మరణించాడని, కారుణ్య నియామకం కింద తనకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని చిలకపాలెం గ్రామానికి చెందిన డి.రేవతి, వైసీపీ హయాంలో ఇళ్ల స్థలాల పేరుతో తమ 0.34 ఎకరాల భూమిని అధికారులు అన్యాక్రాంతం చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామానికి చెందిన పడాల రాములు, రాష్ట్రంలో గ్రంథాలయాల అభివద్ధికి చర్యలు తీసుకోవడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం, కొయ్యలగూడెం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని సమైక్య యూత్ ప్రతినిధులు, 2017-18 అసిస్టెంట్ ప్రొఫెసర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ క్వాలిఫైడ్ అసోసియేషన్ ప్రతినిధులు, పుట్టుకతో దివ్యాంగుడు అయిన తన కుమారుడికి దివ్యాంగ పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని విజయవాడ పోరంకికి చెందిన ఐ.వరప్రసాద్ మంత్రి నారా లోకేష్ ను కలిసి విన్నవించారు. అర్జీలను పరిశీలించిన మంత్రి లోకేష్ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కొన్ని సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించమని సంబంధిత అధికారులను ఆదేశించారు.



గ్రంధాలయా పునర్వికాసానికి కృషి చేయాలని వినతి పత్రం ఇస్తున్న లక్ష్మయ్య తదితరులు

ప్రతి అర్జీనీ పరిశీలించి పరిష్కరించాలి : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందించిన ప్రతి పిటీషన్ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధికారులకు సూచించారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ , సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డిఆర్‌ఓ ఎన్.ఎస్.కే.ఖాజావలి, ఆర్డిఓ శ్రీనివాస రావు ప్రజల నుండి 197 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సిఇఒ జ్యోతిబసు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి..

మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలని ప్రధాని నరేంద్ర మోడీకి గుంటూరు శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. మధ్య భారతదేశంలో ఆదివాసులపై, మావోయిస్టులపై మారణకాండను ఆపాలని కోరారు. శాంతి చర్చలకు మావోయిస్టులు సంసిద్ధత వ్యక్తం చేసిన నేపథ్యంలో దాడులను నిలిపి,వ వావోయిస్టులతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చల కోసం ప్రధాని చొరవ చూపాలని కోరారు. హైకోర్టు న్యాయవాది వై.కె, సిఎల్‌సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర, పి.కె.ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కొండారెడ్డి సిపిఎం గుంటూరు జిల్లా, నగర కార్యదర్శులు వై.నేతాజి, కె.నళినీకాంత్, సిపిఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, బీడీపీ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ డేన్నిస్ రాయ్, వి.పభాకర్, పున్నం రాణి, బి.అంజమ్మ, ఉగ్గం సాంబశివరావు, సిఎస్ఆర్ ప్రసాద్ వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పొట్టేళ్ల చర్మాల ప్రాసెసింగ్ యూనిట్ తొలగించాలి..

ఇళ్ల మధ్య ఉన్న పొట్టేళ్ల చర్మాల ప్రాసెసింగ్ యూనిట్‌ను తొలగించాలని స్థానిక పాతగుంటూరు, జామియానగర్ వాసులు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. జామియా నగర్‌లో రామనాధ పళనియప్పన్ అనే వ్యక్తి ఇల్లు నిర్మించుకొని, దానిలో ప్రభుత్వ అనుమతి లేకుండా పొట్టేళ్ల చర్మాలను జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తీసుకొచ్చి ప్రాసెసింగ్ చేసి, చెన్నైకి ఎగుమతి చేస్తున్నాడన్నారు. దానిలో వచ్చిన కుళ్లిపోయిన వ్యర్థాలను చుట్టుపక్కల ఇళ్ల మధ్య వదిలేస్తున్నాడని, దాని వల్ల దుర్గంధం వ్యాపిస్తుందని, ఇళ్లలో ఉండలేకపోతున్నామన్నారు. అనారోగ్యం పాలువుతున్నామన్నారు. జిఎంసి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. కావున ప్రాసెసింగ్ యూనిట్‌ను తొలగించాలని కోరారు.అర్జీ ఇచ్చిన వారిలో బి.ప్రసాద్, షేక్.రియాజ్, షేక్.వహీద్ ఉన్నారు.



డిప్యూటీ తహశీల్దార్ వేధింపుల నుండి కాపాడాలి..

ఎమ్‌డియు వాహనం విధులకు రిజైన్ చేయాలని డిప్యూటీ తహశీల్దార్ బేగ్ తనను ఒత్తిడి చేస్తున్నారని, తప్పుడు కేసులు పెడతామని బెదిరిస్తున్నారని గుంటూరుకు చెందిన ఎండియు వాహన ఆపరేటర్ చౌటుపల్లి సునీల్‌కుమార్ కలెక్టర్‌ను కోరారు. గత నాలుగేళ్లుగా ఎలాంటి ఫిర్యాదులు లేకుండా ఎండియు ఆపరేటర్‌గా పనిచేస్తున్నానని, ఈ ఏడాది మార్చిలో డిప్యూటీ తహశీల్దార్ ఆకస్మిక తనిఖీ చేశారని, ఎటువంటి వ్యత్యాసం లేకపోయినా ఎక్కడో ఒకరి ఇంటి వద్ద బియ్యం ఉన్నాయని, అవి నీవే అని ఒప్పుకోమని ఒత్తిడి చేశారన్నారు. వాటితో నాకు ఎలాంటి సంబంధం లేదని చెప్పినా వినకుండా నాపై చర్యలకు ఆర్‌డిఒకు శారన్నారు. దీంతో నన్ను ఆపరేటర్‌గా విధుల నుండి తొలగించారని, దీంతో తాను హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు తిరిగి ఆపరేటర్‌గా కొనసాగటానికి ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అయితే మాకు వ్యతిరేకంగా కోర్టుకు వెళతావా అంటూ బేగ్ నీవు బండి ఎలా నిర్వహిస్తావో చూస్తానని బెదిరింపు చేస్తుడన్నారు. రిజైన్ చేయాలని ఒత్తిడి చేస్తున్నాడన్నారు. కస్తూరి శ్రీను అనే బియ్యం వ్యాపారి మాట వినట్లేదని అందుకే నీకు ఈ గతి పట్టిందని ఎగతాళి చేస్తున్నాడన్నారు. కావున వేధింపుల నుండి కాపాడాలని కలెక్టర్‌ను కోరారు.

పింఛను మంజూరు చేయాలని వినతి..

పుట్టుకతోనే శారీరిక, మానసిక వైకల్యంతో బాధపడుతున్న నా కుమార్తె సయ్యద్ అస్మాకు పింఛన్ మంజూరు చేయాలని స్థానిక చుట్టుగుంట 77వ సచివాలయ పరిధిలోని ఆమె తల్లి సయ్యద్ కరీమా గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. నూరు శాతం



వైకల్యం ఉన్నట్టు వైద్యులు ధ్రువీకరించి సదరన్ సర్టిఫికెట్ జారీ చేశారని, కానీ వేలిముద్రలు, ఐరిష్‌కు పడట్లేదని పెన్షన్ రాలేదన్నారు. సచివాలయ సిబ్బందిని అడిగితే ఆధార్ అప్డేట్ లేకుండా పెన్షన్ రాదని చెబుతున్నారని తెలిపారు. ఒకవైపు భర్త చనిపోవడం, మరోవైపు 21 ఏళ్ల కుమార్తె మంచానికే పరిమితం అవ్వడంతో కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి ప్రత్యేక సిఫా ర్సుతో అస్మాకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కు అర్హత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి : మేయర్, కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, గ్రీవెన్స్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో గ్రీవెన్స్ నిర్వహించారు. గ్రీవెన్స్‌లో నగర కమిషనర్‌తోపాటు మేయర్ కూడా పాల్గొన్నారు. డయల్ యువర్ కమిషనర్ కార్యాక్రమం ద్వారా కమిషనర్ 23 అర్జీలు స్వీకరించారు. అనంతరం గ్రీవెన్స్ ద్వారా ప్రజల నుండి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని, అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తామన్నారు. గ్రీవెన్స్‌లో అందిన 33 అర్జీలను ఆయా విభాగాల అధికారులకు అందచేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిపి రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్